క్లుప్తంగా

ఖాదర్‌లింగ స్వామి దర్గాకు పోటెత్తిన భక్తులు



ఫాతెహాలు సమర్పిస్తున్న భక్తులు

కౌతాళం: స్థానిక జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు అధికంగా తరలి వచ్చి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలను సమర్పించారు. దీంతో దర్గా పరిసరాలు భక్తులతో నిండిపోయాయి. అంతకు ముందు తెల్లవారు జామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్ బాషా చిష్టీ స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతెహాలు చేపట్టారు.

ఆర్థిక సాయం

ఆదోని అర్బన్ : ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న సాయినాథ్ కుటుంబానికి గురువారం సాకరే వరల్డ్ సాలీ ఫాండేషన్ ట్రస్టీ మారుతిరావు, నిషావక్తే, విజయ్ వక్తే రూ.20 వేలు ఆర్థిక సాయం గురువారం అందించారు. వారు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. పట్టణంలోని బాబాజీపేటలో నివాసముంటున్న గైక్వాడ ప్రశాంత్, గైక్వాడే రామేశ్వరి దంపతుల పెద్ద కుమారుడు గైక్వాడ సాయినాథ్ మిలటరీలో చేరాలని నంద్యాలలో కోచింగ్ తీసుకుంటున్నాడు. పేద కుటుంబం కావడంతో అక్కడ ఓ స్వీట్ స్టాల్‌లో పార్ట్ టైం జాబ్‌లో చేరాడు. అక్కడ కరెంట్ షాక్‌కు గురై కుడి కాలు, కుడి చేతిని పోగొట్టుకున్నాడు. విషయం తెలుసుకొని తమవంతుగాఆర్థిక సాయం అందజేసినట్లు చెప్పారు.

నేడు పీహెచ్‌సీ ప్రారంభం

కౌతాళం: మండలంలోని బదినేహాల్ గ్రామంలో రూ.1.62కోట్లతో నిర్మించిన నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి శుక్రవారం ప్రారంభిస్తారని ఏఈ సాయిసురేష్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ భవనంలో అత్యాధునిక సేవలు అందుబాటులో ఉంచామని, ఆపరేషన్ థియేటర్‌తో పాటు ముగ్గురు డాక్టర్లు ఉండడానికి ప్రత్యేక గదులు, ఓపీ కోసం, స్టాక్ రూం, ల్యాబ్ కోసం, మందులు భద్రపరచడానికి ప్రత్యేక గదులు, సమావేశం భవనం, టాయిలెట్స్ వంటివి ఏర్పాటు చేశామని చెప్పారు.

కోసిగి ఎస్‌ఐగా సతీష్ కుమార్

కోసిగి: ఆదోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న సతీష్ కుమార్‌ను బదిలీపై కోసిగి ఎస్‌ఐగా నియమిస్తూ జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్‌ఐ రాజారెడ్డిని ఓర్వకల్లు పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసినట్లు తెలిసింది. రాజారెడ్డి ఇక్కడ 14 నెలల పాటు ఎస్‌ఐగా పనిచేశారు.

అర్చకులపై వరాలు కురిపించిన సీఎం

ఆదోని అర్బన్ : అర్చకులకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వరాలు కురిపించారని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు వెల్లాల మధుసూదనశర్మ అన్నారు. గురువారం తన స్వగృహంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా దాదాపుగా నిరాదరణకు గురైన 16 వేల దేవస్థానాలకు ధూపదీప నైవేద్యం కింద జీతాలు ఇచ్చి 16 వేల అర్చక కుటుంబాలకు జీవనోపాధి కల్పించారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ దేవస్థానాల్లో వంశ పారంపర్యంగా అర్చక వ్యవస్థను కొనసాగించాలని నిర్ణయించడం అభినందనీయమన్నారు. చంద్రబాబునాయుడు వచ్చాక వంశపారంపర్యం అర్చక వ్యవస్థను రద్దు చేసి తీరని అన్యాయం చేశారన్నారు.

వ్యక్తిగత సవాళ్లను పార్టీకి ముడిపెట్టొద్దు

పెద్దకడబూరు : వ్యక్తిగత సవాళ్లకు పార్టీకి ముడిపెట్టడం సమంజసం కాదని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా మరోసారి వై.బాలనాగిరెడ్డి గెలుస్తాడని మాజీ ఎంపీపీ రఘురాముడు, తిక్కారెడ్డి గెలుస్తాడని టీడీపీ నాయకుడు మల్లికార్జున నాలుగు రోజులుగా వ్యక్తిగతంగా సవాళ్లు, ప్రతి సవాళ్లు చేసుకుంటున్నారు. ఇలా వ్యక్తిగత సవాళ్లను పార్టీకి ముడిపెట్టరాదన్నారు. తమ పార్టీ పాలనలో సచివాలయాలు, వలంటీర్లు ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతున్నామని చెప్పారు. రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్ రామాంజనేయులు, మాజీ ఎంపీపీ రఘురాముడు, కోసిగి మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ ముక్కరన్న, కో ఆప్షన్ సభ్యుడు షేర్‌ఖాన్‌పటేల్, నాయకులు గజేంద్రరెడ్డి పాల్గొన్నారు.

పొలం రస్తా విషయంలో ఘర్షణ

కోసిగి: మండలంలోని గొడుగల్లు గ్రామంలో పొలం రస్తా విషయంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. గురువారం సాయంత్రం గ్రామంలో పొలం రస్తా పేరుతో పాత కక్షలు మనుస్సులో పెట్టుకుని దావీద్, కుటుంబ సభ్యులపై అదే గ్రామానికి చెందిన ఉరుకుందప్పతో పాటు మరో ఐదుగురు దాడి చేశారు. దీంతో దావీద్‌తో పాటు మరొకరి తలకు గాయాలు కావడంతో కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో ఆదోనికి తరలించారు. బాధితులు కోసిగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- వలంటీర్లుగా అధిక శాతం మహిళలే
- ప్యాకేజీ స్టార్.. పవన్‌కళ్యాణ్.. నోరు అదుపులో పెట్టుకో
- ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి
- చిన్నహరివాణంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



చిన్నహరివాణంలో మహిళలకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని రూరల్ : గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని నెరవేరుస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ వ్యవస్థ, వాటిని అనుబంధంగా వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచాయని అలాంటి వాటిపై ఆరోపణలు చేయడానికి మనస్సుండాలని, వారి నిస్వార్థ సేవలను ప్రశంసించాల్సి పోయి నోరు పారేసుకుంటారా అంటూ.. ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి మండిపడ్డారు. గురువారం చిన్నహరివాణం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పార్టీ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం నుంచి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. గ్రామంలో మురుగు కాలువలు, మరుగుదొడ్ల సమస్యలు ఉన్నాయని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను పరిష్కరించేందుకు ఆయాశాఖల అధికారులను పిలిపించి మాట్లాడి పరిష్కారమార్గం చూపారు. గ్రామ వీఆర్వో దీపిక విధుల పట్ల అలసత్వం వహిస్తూ, ప్రజలను నిర్లక్ష్యం చేస్తుందని, ఆమెపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎమ్మెల్యే తక్షణమే తహసీల్దార్ వెంకటలక్ష్మికి ఫోన్ చేసి వీఆర్వోపై ఉన్నతాధికారులకు నివేదిక పంపాలని సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్యాకేజీ స్టార్ పవన్‌కళ్యాణ్ గాలి మాటలను ప్రజలు నమ్మరని, చంద్రబాబునాయుడుతో కలిసి చేస్తున్న డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారని వచ్చే ఎన్నికల్లో మరోసారి జనసేన, టీడీపీలను ప్రజలు చిత్తుగా ఓడిస్తారని చెప్పారు. వలంటీర్ల గురించి అవాకులు చెవాకులు పేలడం సరికాదని, పవన్ కళ్యాణ్ నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, ఆర్‌ఐ జయరామిరెడ్డి, పీఆర్ ఏఈ మాలిక్ బాషా, ఏపీఓ చంద్రశేఖర్, సర్పంచ్ రామకృష్ణారెడ్డి, నాయకులు శ్రీలక్ష్మి, రేణుక, కల్పవల్లి, శ్రీనివాసరెడ్డి, ఈరన్న పాల్గొన్నారు.

కరోనా సమయంలో సేవలు అభినందనీయం

ఇక్కడ పచ్చి టెంకాయల వ్యాపారికి మాస్కులు అందజేస్తున్న వలంటీర్ పేరు డమ్మలదిన్నె వెంకటేశ్. డిగ్రీ బీకాం చదివిన ఇతను మంత్రాలయం సచివాలయం -1 పరిధిలో వలంటీర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. మొదటి విడత కరోనా సమయంలో కల్లుదేవకుంట ప్రాథమిక ఆసుపత్రి వైద్యుడు సుబ్బరాయుడు, వైద్య సిబ్బంది, సర్పంచు భీమయ్యతో కలసి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు మాస్కులు, శానిటైజర్లు అందజేయడం, కరోనా బారిన పడిన వారికి ధైర్యం చెప్పి మందులు అందజేయడం, కేర్ సెంటర్లకు తరలించడం, డిశ్చార్జి అయి వచ్చిన వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునే వాడు. అలాగే ఇళ్ల నుంచి బయటకు రాలేని వారికి ఇంటికే వెళ్లి కిరాణా సరుకులు, మందులు అందజేసేవాడు.



మాస్కులు పంపిణీ చేస్తున్న వలంటీర్ డమ్మలదిన్నె వెంకటేశులు

ఇలా 50 కుటుంబాలకు ఆ సమయంలో అండగా నిలిచాడు. ఇలా ప్రాణాలకు తెగించి నాడు సేవలందించడంతో స్థానికులతో పాటు వైద్యులు, అధికారులు అభినందించారు.

–మంత్రాలయం రూరల్

వలంటీర్ సేవలు మరవలేనివి



కరోనా తొలి దశలో నాకు పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. వైద్యులు ఇంట్లోనే ఉండమన్నారు. వారి సూచనలు, చికిత్సతో కోలుకున్నా. క్వారంటైన్ సమయంలో మా ఇంట్లో వారు కూడా ఇంట్లోనే ఉండిపోయారు. నేను మాత్రం వేరే గదిలో 15 రోజుల పాటు ఉండాల్సి వచ్చింది. ఆ సమయంలో మా వలంటీర్ వెంకటేశులు మాకు అవసరమైన కూరగాయలు, పండ్లు, సరుకులు, మంచినీళ్లు, మందులు అందజేసేవాడు. బాగుపడిన తరువాత కూడా ఆరోగ్యంపై వాకబు చేసేవాడు. సొంత వాళ్లే దూరంగా ఉండే కాలంలో వలంటీర్ మాత్రం అన్నీ తానై చూసుకున్నాడు. ఆయన సేవలను మా కుటుంబం ఎన్నటికీ మరవదు. - శ్రీనివాసుల శెట్టి, మంత్రాలయం పాతూరు కాలనీ

ఈ- కేవైసీ కోసం తెలంగాణకు..

ఈ చిత్రంలో పొలంలో ఈ-కేవైసీ చేస్తున్న మహిళ పేరు చూడి మహదేవి. కౌతాళం మండలం ఏరిగేరి మజరా గ్రామమైన లక్ష్మినగర్‌కు చెందిన ఈమెతో పాటు బైటిగేరి వెంకటేశమ్మ, బోయ ఈరమ్మ, గజ్జెహాళ్లి లక్ష్మి తదితరులు గ్రామంలో పనులు లేకపోవడంతో ఈ ఏడాది ఏప్రిల్‌లో తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా పాములపాడు గ్రామానికి వలస వెళ్లారు. అయితే వారి రేషన్ కార్డులకు సంబంధించి ఈ-కేవైసీ చేయాల్సి ఉండగా వారు గ్రామంలో లేకపోవడం, ఈ-కేవైసీ చేయకపోతే కార్డులు రద్దవుతాయని గ్రామానికి చెందిన వలంటీర్ మూకన్న అక్కడికి వెళ్లి వారితో ఈ- కేవైసీ చేయించాడు. దీంతో వలస వెళ్లిన గ్రామస్తులు వలంటీర్‌ను అభినందించారు. - కౌతాళం



తెలంగాణ పొలాల్లో మహదేవితో ఈ-కేవైసీ చేయిస్తున్న వలంటీర్ మూకన్న

మా రేషన్ కార్డు రద్దు కాకుండా చేశాడు



నల్గొండ జిల్లాకు పలువురు గ్రామస్తులం వలస వెళ్లాం. ఇదే సమయంలో రేషన్ కార్డు ఉన్న వారు ఈ-కేవైసీ చేయాలని అధికారులు చెప్పడంతో మా గ్రామ వలంటీర్ మూకన్న అక్కడికి వచ్చి నాతో పాటు మా గ్రామానికి చెందిన వారందరితో ఈ-కేవైసీ చేయించాడు. దీంతో మా రేషన్ కార్డు రద్దు కాలేదు. ప్రస్తుతం మేం సంక్షేమ పథకాలు అందుకుంటున్నామంటే మూకన్న చేసి సహాయం వల్లే. అంత దూరం వచ్చినా మా నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకోలేదు. అలాగే అక్కడికి వచ్చి పింఛన్ సొమ్ము అందజేశాడు. - చూడి మహదేవి

సచివాలయంలో ఆధార్ సేవలు



కోసిగి సచివాలయం-4లో ఆధార్ అప్‌డేట్ చేస్తున్న సిబ్బంది

కోసిగి: స్థానిక సచివాలయం-4 లో ఆధార్ సేవలను ఈనెల 11న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ప్రారంభించారు. ఆధార్ కార్డులో పేర్లు, అడ్రస్ మార్పులు, వయస్సు, తేదీ, ఫోన్ నంబర్ లింక్ మార్పుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఆధార్ కార్డు నమోదు చేసుకున్న తర్వాత ప్రతి 5, 15 ఏళ్ల తర్వాత తప్పక అప్‌డేట్ చేసుకోవాలని ప్రభుత్వం పేర్కొనడంతో ప్రజలు అప్‌డేషన్ చేయించుకుంటున్నారు. ప్రజల ఇబ్బందులు గుర్తించి ప్రభుత్వ తరుపున సచివాలయం-4లో కొత్తగా ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయించారు. ఇందుకు ముగ్గురు డిజిటల్ అసిస్టెంట్స్‌ను నియమించారు.

ఆధార్ కార్డు నమోదు చేశారు



కర్నూలు మున్సిపల్ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నా. ఇటీవల నా భార్య మండలానికి ఉపాధ్యాయునిగా బదిలీ అయ్యారు. మా పిల్లలకు 5 ఏళ్లు పూర్తి కావడంతో కోసిగి-4 సచివాలయంలో కుమారుడు భవంత్ ఆదిత్య, కుమార్తె సాయి భవంతికకు ఆధార్ అప్‌డేట్ చేయించాం.

-రవిప్రకాష్, కర్నూలు

రెగ్యులర్‌గా సేవలు ఉంటాయి



కోసిగి సచివాలయం-4లో రెగ్యులర్‌గా ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయి. ఆధార్ సేవలందించేందుకు ముగ్గురు డిజిటల్ అసిస్టెంట్లకు లైసెన్స్‌లు వచ్చాయి. వారికి విడతల వారీగా విధులు కేటాయించాం. ప్రజలు ఇబ్బందులు పడకుండా ఆధార్ సేవలు పొందవచ్చు. త్వరలోనే చింతకుంట గ్రామంలో కూడా ఆధార్ సేవలు అందుబాటులోకి తెస్తాం.

- రాజేంద్ర ప్రసాద్, ఎంపీడీఓ

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

పెద్దకడబూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి సాక్షర భారత్ కో ఆర్డినేటర్ల కుటుంబాలు రుణపడి ఉంటామని స్వచ్ఛ భారత్ మండల రిసోర్స్ కో ఆర్డినేటర్ నారాయణ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో రాష్ట్రంలో దాదాపుగా 485 మందికి పైగా, ఉమ్మడి జిల్లాలో 52 మంది సాక్షర భారత్ మండల కో ఆర్డినేటర్లుగా నియమితులయ్యారని ఎనిమిదేళ్ల తరువాత టీడీపీ ప్రభుత్వ హయాంలో తమను పక్కనబెట్టారని గుర్తు చేశారు. దీంతో 485 మంది కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు.నాడు పాదయాత్ర చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వెళ్లి కలువగా మన ప్రభుత్వంలో మీకు దారి చూపుతానని హామీఇచ్చారన్నారు. ఇందులో భాగంగా రిసోర్స్ కో ఆర్డినేటర్లుగా తమకు మళ్లీ జాబ్‌లు ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

జగనన్న సురక్షపై సమీక్ష

కౌతాళం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలో ఇప్పటి వరకు జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంపై తహసీల్దారు గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. వీఆర్‌ఓ, కార్యదర్శులతో ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 12పంచాయతీల్లో కార్యక్రమం జరిగిందని ఇంకా 11 పంచాయతీలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమం జరిగిన పంచాయతీల్లో ఇంకా ఏవైనా సమస్యలున్నాయా అని ఆరా తీశారు.

నేడు 'జగనన్న సురక్ష'

మంత్రాలయం రూరల్: మండలంలోని మాధవరం, మాధవరం తండా గ్రామ పంచాయతీల్లో జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మణిమంజరి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ మాధవరం సచివాలయం -1లో తహసీల్దార్ చంద్రశేఖర్, మాధవరం తండా సచివాలయం -2లో ఎంపీడీఓ అధికారుల బృందం సమక్షంలో నిర్వహిస్తారని చెప్పారు.

ప్రజలు ప్రశాంతంగా జీవించాలి



మాట్లాడుతున్న డీఎస్పీ శివనారాయణ స్వామి

ఆదోని రూరల్ : గ్రామాల్లోని ప్రజలు ప్రశాంతంగా జీవించాలని ఆదోని డీఎస్పీ శివనారాయణస్వామి సూచించారు. గురువారం మండలంలోని గణేకల్ గ్రామంలో ఎస్ఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో ప్రజలకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ చిన్న విషయాలకు గొడవలకు పాల్పడి ఆర్థికంగా నష్టపోరాదన్నారు. సమస్యలను సామరస్యంగా గ్రామాల్లోనే పెద్దల సమక్షంలో పరిష్కరించుకోవాలని సూచించారు. పిల్లలను తల్లిదండ్రులు బాగా చదివించాలని కోరారు.

అసత్య ప్రచారం మానుకోవాలి

ఆదోనిటౌన్ : టీడీపీ నాయకులు అసత్య ప్రచారాలు మానుకోవాలని వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా సూచించారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కౌన్సిలర్ సురేష్, యూత్ సెక్రటరీ మధుతో కలిసి మాట్లాడారు. మండలంలోని సంతెకూడ్లూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు 25 మంది టీడీపీలో చేరారని ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఉమాపతి చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వారు టీడీపీలోనే ప్రత్యర్థివర్గమైన గుడిసె క్రిష్ణమ్మ, మదిరె భాస్కర్‌రెడ్డి, దేవేంద్రప్ప, రావూఫ్, రామచంద్ర వర్గానికి చెందిన కార్యకర్తలని, అది గమనించకుండా వారు తమ పార్టీ వారు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. టీడీపీలో రెండువర్గాలుగా విడిపోవడంతో ఎవరు ఏ వర్గం వారో గుర్తుంచలేకపోతున్నారనేది ఈ సంఘటనే నిదర్శమని ఎద్దేవా చేశారు. నాయకులు లక్ష్మినారాయణ, చిన్నఈరప్ప, సిద్ధమల్లికార్జున, కుప్పయ్య, సుధాకర్, ఆరేకల్ నాగరాజు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రజా సమస్యల పరిష్కారం

- మండిగిరిలో 2,119 సర్టిఫికెట్ల అందజేత

ఆదోని రూరల్ : జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని ఎంపీడీఓ గీతావాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి, మండిగిరి మాజీ సర్పంచ్ శేషిరెడ్డి అన్నారు. గురువారం మేజర్ గ్రామ పంచాయతీ మండిగిరి సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓతో పాటు డిప్యూటీ తహసీల్దార్ రజనీకాంత్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. అనంతరం మొత్తం 2,119 మందికి వివిధ రకాల ధ్రువ పత్రాలు అందజేశారు. పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, వీఆర్వో హనుమంతరావు, ఎస్సీ సెల్ నాయకులు కల్లుపోతుల సురేష్, ఉలిగప్ప, కడితోట ఈరన్న, దమ్మూర లక్ష్మన్న, రాజు పాల్గొన్నారు.

పెద్దకడబూరు : అర్హులందరికీ 11రకాల ధ్రువ పత్రాలను అందజేస్తామని ఈఓపీఆర్డీ జనార్ధన్, ఆర్‌ఐ మహేష్ పేర్కొన్నారు. మండలంలోని కల్లుకుంట గ్రామంలో సర్పంచ్ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 140 మందికి ధ్రువ పత్రాలను అందజేశారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయకుమారి, తహసీల్దారు పాల్గొన్నారు.

ఆదోనిటౌన్ : జగనన్న సురక్షతో ప్రజా సంక్షేమం మెరుగు పడుతుందని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, చైర్‌పర్సన్ బోయశాంత చెప్పారు. దరఖాస్తు చేసుకున్న ఒకటి, రెండు రోజుల్లోనే ఉచితంగా సర్టిఫికెట్లు అందజేస్తున్నామని చెప్పారు.



మండిగిరిలో సర్టిఫికెట్లను అందజేస్తున్న దృశ్యం

వార్డుల వారీగా ధ్రువ పత్రాల పంపిణీ..

1. 20వ వార్డులో 1300 మంది దరఖాస్తు చేసుకోగా, 548 మందికి అధికారులు సర్టిఫికెట్లను అందించారు.
2. 26వ వార్డులో 531 దరఖాస్తులకు 277 ధ్రువ పత్రాలు అందజేశారు.
3. 22వ వార్డులో ఆదాయ సర్టిఫికెట్లు 129, కుల సర్టిఫికెట్లు 161 పంపిణీ చేశారు.
4. 23వ వార్డులో 796 దరఖాస్తులకు గానూ 433 సమస్యలు పరిష్కారమయ్యాయి. కులం 306, ఆదాయం సర్టిఫికెట్లు 243 అందజేశారు.



కల్లుకుంటలో అర్హులకు ధ్రువ పత్రాలు పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

గురువారం స్థానిక మంగళ ఆంజనేయస్వామి కల్యాణ మండపంలో 20, 26వ వార్డులు, శంకర్‌నగర్‌లోని అర్బన్‌హెల్త్ సెంటర్ పక్కనున్న హాలులో 22, 23 వార్డులకు సంబంధించి జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కల్యాణ మండపంలో కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, మేనేజర్ విజయ్‌భాస్కర్ రెడ్డి, శంకర్‌నగర్‌లో అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, ఎంఈ నాగభూషణ్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. కౌన్సిలర్లు రఘునాథ్‌రెడ్డి, టీపీఓ శ్రీనివాసులు, కన్వీనర్లు డీలర్ గోపాల్, కుద్దూస్, విజయకుమారి పాల్గొన్నారు.

కౌతాళం: జగనన్న సురక్ష కార్యక్రమంతో గ్రామాల్లో సమస్యలు పరిష్కారం అవుతాయని కామవరం సర్పంచ్ వసంత, ఉప్పరహాల్ సర్పంచ్ తులసీ పేర్కొన్నారు. మండలంలోని ఉప్పరహాల్ గ్రామంలో తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి టీం, కామవరం గ్రామంలో ఎంపీడీఓ సుబ్బారాజు టీంలు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీటీసీ గణేష్, నాయకులు గంగధర్, సచివాలయ కన్వీనర్ ముత్తన్న, శాంతి, ఆర్‌ఐ రాజశేఖర్, నాయకులు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.



ఆదోనిలో సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు



కామవరంలో ధ్రువపత్రాలను అందజేస్తున్న సర్పంచ్, ఎంపీడీఓ

జగనన్న చేయూత పథకం కోసం దరఖాస్తు చేసుకున్నా



జగనన్న చేయూత పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి కుల, ఆదాయ సర్టిఫికెట్ల కోసం జగనన్న సురక్ష ద్వారా దరఖాస్తు చేసుకున్నా. కులం, ఆదాయం సర్టిఫికెట్ కావాల్సి ఉండగా, వలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకున్నా. దరఖాస్తు చేసుకున్న ఒక్కరోజులోనే కులం, ఆదాయం సర్టిఫికెట్లను అందించారు. ఈ యేడాది నాకు ఉన్నచోటే సర్టిఫికెట్లను అందించారు.

– అడివమ్మ, రాజీవ్‌గాంధీనగర్, మండిగిరి

ఒక్కరోజులోనే సర్టిఫికెట్ అందించారు



కొత్తగా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు కుల, ఆదాయ సర్టిఫికెట్లు అవసరమని చెప్పారు. దీంతో జగనన్న సురక్ష ద్వారా దరఖాస్తు చేసుకున్నాను. దరఖాస్తు చేసుకున్న 24 గంటల్లోగా సర్టిఫికెట్లను అందించారు. చాలా సంతోషంగా ఉంది. అలాగే కొత్త పింఛన్ కూడా వస్తుందనే నమ్మకం ఏర్పడింది.

– తిక్కన్న, దొమ్మరగేరి, మండిగిరి

ఎంబీబీఎస్‌లో చేరేందుకు సర్టిఫికెట్లు అవసరమయ్యాయి



ఈ ఏడాది ఎంబీబీఎస్‌లో చేరేందుకు కుల, ఆదాయ సర్టిఫికెట్లు కావాలి. వాటి కోసం వలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకున్నా. ఒక్కరోజులోనే సర్టిఫికెట్లు అందించారు. చాలా సంతోషంగా ఉంది. ఇంటి వద్దకే సర్టిఫికెట్లు అందించడం అభినందనీయం.

– అవినాష్, మండిగిరి

వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు తగదు







పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టిన వలంటీర్లు , భీమాస్ సర్కిల్‌లో పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం, పవన్ కళ్యాణ్ ఫ్లెక్సీని తగలబెడుతున్న వలంటీర్లు

ఆదోనిటౌన్ : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులకు అందజేసి పేదల అభ్యున్నతికి తమ వంతుగా కృషి చేస్తున్న వలంటీర్లపై పవన్ కళ్యాణ్ పరుష వ్యాఖ్యలు తగదని వలంటీర్ ముక్త కంఠంతో ఖండించారు. ఈ మేరకు గురువారం పట్టణంలో నిరసన కార్యక్రమం చేపట్టి ఆయన దిష్టిబొమ్మకు శవయాత్ర చేపట్టి దహనం చేశారు. స్థానిక మున్సిపల్ గ్రౌండ్ నుంచి ర్యాలీగా భీమాస్ సర్కిల్ వరకు వచ్చి అక్కడ రాస్తారోకో నిర్వహించారు. అనంతరం పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు రేణుక, లక్ష్మి, మహేశ్వరి, శైలజ, స్వరూపరాణి, అనసూయ, భారతి, బి.రేణుక, జయలక్ష్మి, భవానీ, సంతోష్ మాట్లాడారు. పవన్ కళ్యాణ్ ఓ పార్టీ అధినేత అయ్యి ఉండి ప్రజలకు సేవలందిస్తున్న వలంటీర్లపై అనాలోచితంగా వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. వలంటీర్ల సేవలను మెచ్చుకోవాల్సింది పోయి విమర్శించడంపై మండిపడ్డారు. ప్రజలకు సేవలు అందించడమే తమ లక్ష్యమని వలంటీర్లు స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా, కన్వీనర్ మధుసూదన్‌శర్మ, వలంటీర్లు పాల్గొన్నారు.